కథ

# వరహాలరావు వంటావార్పు

**"ఏవండోయ్! మిమ్మల్నే! కాఫీ పెట్టమన్నానా! ఆ పేపరు తరవాత చదవొచ్చును కదా!" అంటున్న ఆండాళ్ళు అరుపులకు ఉలిక్కి పడి చేతిలో పేపరు పక్కన పెట్టేలోగానే లాగేసుకుని టీపాయ్ మీద పడేసింది.**

**"అలా చూస్తారేమిటండీ! పొద్దున్నే చదవకపోతే ఆ పేపర్లో వార్తలేమయినా అరిగిపోతాయా, తరిగిపోతాయా? ముందు లేచి కాఫీ కలుపుకుని రండి" అంటూ తను కుర్చీలో కూర్చుని పేపర్ చేతిలోకి తీసుకుంది.**

వరహాలరావు వంటింట్లోకి వెళ్ళి స్టౌ వెలిగించి పాలు కాగబెట్టి కాఫీ కలిపి రెండు కప్పుల్లో పోసి తీసుకుని వచ్చి ఒకటి భార్యకిచ్చి తనొకటి తీసుకున్నాడు.

కాఫీ తాగుతూ ఆలోచిస్తున్నాడు వరహాలరావు. ఇంతకు ముందయితే ఎంచక్కా కాఫీ కప్పుతో నిద్రలేపేది ఆండాళ్ళు. కమ్మగా వంట చేసి కొసరి కొసరి వడ్డించేది. 'మగవాళ్ళకి సంపాదన లేకపోతే ఇంట్లో గౌరవం తగ్గిపోతుంది' అంటారు. కానీ తను రిటైరయి కూడా పదేళ్ళపైనే అయింది. ఇంతవరకు తన గౌరవానికెటువంటి భంగం కలుగలేదు. అటువంటిది ఈమధ్య ఎందుకనో ఆండాళ్ళు ఇంట్లో పనులన్నీ తనతోనే చేయిస్తోంది. తన మీద పెత్తనం చెలాయిస్తోంది కూడాను.

''ఏవండీ! ఈరోజు వంట మీరే చేయాలి'' అంటూ ఆర్డరు వేసేసింది ఓరోజు.

''ఇది చాలా అన్యాయం ఆండాళ్ళూ! నేను వంట చేయటమేమిటి? ఎప్పుడయినా చేశానా అసలు! నాకు వంట చేయడం రాదు''

''ఎలా చేయాలో నేను చెప్తాను చేద్దురుగాని. అదేం బ్రహ్మవిద్య అనుకున్నారా! నేర్చుకుంటే అదే వస్తుంది. నలభీమపాకం అని వినలేదా మీరు! మా ఆడవాళ్ళకంటే మీ మగవాళ్ళే బ్రహ్మాండంగా వంట చేస్తారనే కదా అర్థం'' అంటూ నన్ను మాట్లాడనివ్వలేదు.

అక్కడికీ ''నీ చేతి వంట అమోఘం ఆండాళ్ళూ! చక్కగా నీ చేత్తో వండిపెడితే తింటేనే నాకు తృప్తిగా ఉంటుంది'' అన్నాను.

''అందుకే ఇన్నాళ్ళూ నేనే గదా చేశాను. ఇప్పుడు నాకు మీ చేతివంట తినాలనుంది'' అంటూ.

వంటగది గుమ్మంలో వాలుకుర్చీ వేసుకుని కూర్చుని సినిమా డైరెక్టర్‌లా డైరెక్షన్స్ ఇస్తూ వంటంతా వరహాలరావుతోనే చేయించింది. అలా ప్రారంభమయింది వరహాలరావు పాకశాస్త్ర ప్రవేశం.

★ ★ ★

> **ఎప్పుడూ అణకువగా ఉంటూ ఇటీవల కాలంలో తనమీద పెత్తనం చేస్తూ, తనతో వంటలు వండిస్తూ హడావుడి చేసిన ఇల్లాలు లేక ఇల్లు చిన్నబోయింది. వరహాలరావు గుండె బాధతో బరువెక్కింది.మనసు బాగా లేనప్పుడు పిల్లల చిన్ననాటి ఫోటో ఆల్బమ్‌లు చూసుకోవటం వాళ్ళకు అలవాటు. ఆ ఫోటోలను చూస్తూ అప్పటి కబుర్లు చెప్పుకుంటూ వాళ్ళిద్దరూ సేద తీరేవారు. వరహాలరావు ఆల్బమ్ ముందు పెట్టుకుని కూర్చున్నాడు. పుస్తకం తెరవగానే అందులో మడత పెట్టి ఉన్న కాగితం కనిపించింది. మడత విప్పి చూస్తే అందులో ఆండాళ్ళు చేతి వ్రాత కనిపించింది. అక్షరాల వెంట ఆయన కళ్ళు పరుగులు తీశాయి.**

''నేనుండగా మీరు చేతులు కాల్చుకోవటం ఎందుకు? మగవాళ్ళతో పనులు చేయించకూడదు. తప్పు'' అంటూ వరహాలరావును వంటగది చాయలకైనా రానిచ్చేది కాదు. అలాంటిది ఉదయం కాఫీ టిఫిన్ల దగ్గరనుండి రాత్రి పాలు తోడుబెట్టటం వరకు అన్నిపనులు గద్దించి, గదమాయించి మరీ జబర్దస్తీగా భర్తతో చేయించేస్తోంది.

**అబ్బరాజు జయలక్ష్మి**

ఆండాళ్ళు వండి వడ్డిస్తే ఆ టైమ్‌కు వచ్చి కంచం ముందు కూర్చుని సుష్టుగా భోజనం చేయటం తప్ప ఏమీ తెలియని వరహాలరావు వంట పనితో తంటాలు పడుతున్నాడు.

'చచ్చి స్వర్గాన ఉన్న మా అమ్మ కూడా చిన్నప్పుడు నాతో ఏ పనీ చేయించలేదు కదా' అంటూ బాధపడ్డాడు.

''ఏమిటా సణుగుడు! నన్ను తిట్టుకుంటున్నారా! ఏళ్ళతరబడి మా ఆడవాళ్ళం వంటింట్లో మగ్గిపోతుంటే మీలాంటివాళ్ళకి కించిత్తు కూడా బాధ కలగదు. మా కష్టం ఏమిటో మీకిప్పుడైనా తెలుస్తుంది కదూ!'' అంటూ ఉపన్యాసం మొదలెట్టింది.

ఈమధ్య ఆండాళ్ళు ఇలా ప్రతిదానికి ఆడవాళ్ళ హక్కులు, మగవాళ్ళ అధికారాలు అంటూ లెక్చర్లివ్వటం ఎక్కడ నేర్చుకుందో! టి.వి. సీరియల్స్ ప్రభావమా! లేక ఇరుగుపొరుగమ్మల సావాసదోషమా!

కాని ఏమాట కామాటే చెప్పుకోవాలి. ఆండాళ్ళు ఉత్త అమాయకురాలు. 'పతియే ప్రత్యక్షదైవం' అన్నట్లు మసలుకుంటూ ఆమె తనతో నలభై సంవత్సరాల వైవాహిక జీవితం గడిపింది.

వయసు పైబడినందువల్ల ఓపిక లేక తను వంట చేయలేకపోతోందేమో అని 'వంటమనిషిని పెట్టుకుందామా ఆండాళ్ళూ' అని అడిగాడు తను.

అంతే.

''ఎందుకూ దండగ! ఇన్నాళ్ళబట్టి నేను చేసినప్పుడు లేదుగానీ ఇప్పుడు మీకు పని చెప్పానని వంట మనిషిని పెడతానంటారా! అయినా ఎవరూ నమ్మకంగా పని చేయరు. వాళ్ళ వెనక మనం కాపలా కాయవలసి వస్తుంది'' అంటూ వంట మనుషుల గురించి తనిన్నాళ్ళు పడిన శ్రమ గురించి గుక్క తిప్పుకోకుండా అరగంట సేపు చెప్పి నోరు మూయించింది.

ఇక వంట తప్పనిసరి తంటా అయింది వరహాలరావుగారికి. ఒక నెల పదిహేనురోజులు గడిచేసరికి నలభీములంత బాగా కాకపోయినా కాఫీ టిఫిన్లు, వంటావార్పూ అన్నీ బాగానే చేయటం నేర్చుకోగలిగాడు.

★ ★ ★

ఆండాళ్ళు, వరహాలరావు దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు. వాళ్ళకు పెళ్ళిళ్ళు చేసి అత్తగారిళ్ళకు పంపేశాక భార్యభర్తలిద్దరూ కొన్నాళ్ళు ఒంటరితనాన్ని అనుభవించారు. తరువాత అలవాటుపడిపోయారు. ఒకరికోసం ఒకరం అన్నట్లుగా బ్రతకటం నేర్చుకున్నారు.

పండుగలకు, పబ్బాలకు కూతుళ్ళు, అల్లుళ్ళు వచ్చినప్పుడు ఇల్లంతా కళకళలాడుతూ

ఎంతో సందడిగా ఉండేది. మనవళ్ళు, మనవరాళ్ళతో కలిసి సరదాగా ఆడుతూ పాడుతూ గడిపేవాళ్ళు. వాళ్ళు వెళ్ళగానే మళ్ళీ మామూలే! ఇద్దరూ తమ తమ ఫ్రెండ్స్ సర్కిల్‌ను పెంచుకుంటూ వాళ్ళతో కాలక్షేపం చేయటం అలవాటు చేసుకున్నారు.

★ ★ ★

ఆరోజు ఆదివారం. మామిడికాయ పప్పు, కొబ్బరి పచ్చడి, మునక్కాడల సాంబారు, వంకాయకూర అన్నీ భర్తతోనే చేయించింది ఆండాళ్ళు.


ఆండాళ్ళు స్నేహితురాలు పంకజం, ఆమె భర్త పరాంకుశం భోజనానికి వచ్చారు. వాళ్ళు భోజనం చేస్తూ వంట చాలా బాగుంది అంటూ ఆండాళ్ళను తెగ మెచ్చుకున్నారు. ఆ ప్రశంసలన్నీ అందుకోవలసిన వరహాలరావు మౌనంగానే ఉన్నాడు. వంట నేనే చేశాను అని చెప్పాలంటే ఇబ్బందిగా అనిపించింది. అసలే ఆ పంకజం దృష్టిలో ఆడవాళ్ళే తెలివైనవాళ్ళు, మగవాళ్ళు అంటే భర్తలందరూ చవటలు. ఇక తను వంట చేసిన సంగతి తెలిస్తే తనొక వాజమ్మ క్రింద జమ కట్టేసి ఊరంతా ప్రచారం చేసినా చేస్తుంది. ఆండాళ్ళు మాత్రం వాళ్ళ పొగడ్తలకు పొంగిపోతూ ఓరగా భర్తవంక చూసి నవ్వింది.

''మీకు వంట చేయటం వచ్చేసిందండోయ్'' అన్నట్లుంది ఆ చూపు.

★ ★ ★

వరహాలరావు ఒంటరివాడయ్యాడు. హార్ట్ ఎటాక్‌తో ఆండాళ్ళు మరణించి నెలరోజులయింది. బంధువులు, కూతుళ్ళు, అల్లుళ్ళు ఎక్కడివాళ్ళక్కడ వెళ్ళిపోయారు. ఎవరెంత చెప్పినా ఆయన ఎవరి దగ్గర ఉండటానికీ అంగీకరించలేదు.

ఎప్పుడూ అణకువగా ఉంటూ ఇటీవల కాలంలో తనమీద పెత్తనం చేస్తూ, తనతో వంటలు వండిస్తూ హడావుడి చేసిన ఇల్లాలు లేక ఇల్లు చిన్నబోయింది. వరహాలరావు గుండె బాధతో బరువెక్కింది.



మనసు బాగా లేనప్పుడు పిల్లల చిన్ననాటి ఫోటో ఆల్బమ్‌లు చూసుకోవటం వాళ్ళకు అలవాటు. ఆ ఫోటోలను చూస్తూ అప్పటి కబుర్లు చెప్పుకుంటూ వాళ్ళిద్దరూ సేద తీరేవారు. వరహాలరావు ఆల్బమ్ ముందుపెట్టుకుని కూర్చున్నాడు. పుస్తకం తెరవగానే అందులో మడత పెట్టి ఉన్న కాగితం కనిపించింది. మడత విప్పి చూస్తే అందులో ఆండాళ్ళు చేతి వ్రాత కనిపించింది. అక్షరాల వెంట ఆయన కళ్ళు పరుగులు తీశాయి.

''మనం మన బాధ్యతలన్నిటిని పూర్తి చేసుకుని జీవిత చరమాంకంలోకి అడుగు పెట్టాము. ఈ రంగం నుండి మనలో ఎవరు ముందు, ఎవరు వెనుక నిష్క్రమిస్తారో తెలియదు. ఒకవేళ నేనే గనుక ముందుగా వెళ్ళిపోతే, నేను లేకపోతే మీరు ఏమయిపోతారోనని తలచుకుంటేనే నాకు చాలా దిగులుగా ఉంటుంది. ఎందుకంటే మీకు వేళకు అన్నీ ఎవరు అమర్చిపెడతారు? గ్యాస్ స్టవ్ వెలిగించటం కూడా రాని మీరు వంట ఎలా చేసుకుంటారు? వంటగదిలో ఏ డబ్బాలో ఏమున్నాయో కూడా తెలియని మీరు నేను లేకపోతే ఎంత అవస్థపడతారో! అభిమానవంతులైన మీరు ఎవరి ఆశ్రయంలోను ఉండలేరని నాకు తెలుసు. అందుకే ఆలోచించి నేను మీకు వంట చేయటం నేర్పాలని నిర్ణయించుకున్నాను. మామూలుగా చెబితే మీరు వినరని నాకు తెలుసు. అందువలన కొంత నిక్కచ్చిగాను, మరికొంత కఠినంగాను, ప్రవర్తించాను. అందుకు నన్ను మన్నించండి. నేను కూర్చుని మీతో వంట చేయించటం నాకు చాలా బాధగా ఉన్నా నేను అనుకున్నది నెరవేరాలంటే అలా చేయక తప్పలేదు. ఎలా అయితేనేం! మీకు వంటావార్పు నేర్పగలిగాను. నాకిపుడు మీ గురించి దిగులు లేదు. నేను లేకపోయినా మీరు ఇంత ఉడకేసుకుని తినగలరు. నాకిప్పుడు నిశ్చింతగా వుంది.''

చదువుతున్న వరహాలరావు కళ్ళవెంట అశ్రువులు రాలి చేతిలోని కాగితంపై పడుతున్నాయి. ఆయన తన అర్ధాంగి ఆండాళ్ళుకు నిశ్శబ్దంగా అందిస్తున్న బాష్పాంజలులకు అందులోని అక్షరాలు సాక్ష్యంగా తడుస్తున్నాయి.

☆